క్లుప్తంగా

కుల గణన సర్వే పరిశీలన

పెదప్రోలు(మోపిదేవి): మండలంలో కుల గణనపై సర్వే వేగవంతం చేశారు. బుధవారం తెల్లవారు జాము నుంచే సచివాలయ అధికారి, వలంటీర్ ఇంటింటా తిరిగి కులగణన సర్వే నిర్వహించారు. కుటుంబ పెద్దల నుంచి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల బయోమెట్రిక్ అథెంటికేషన్ ద్వారా యాప్‌లో వివరాలు నమోదు చేశారు. ఇంటి యజమాని, ఇంటిలో సభ్యులు, వారి వయస్సు, ఏ సామాజిక వర్గానికి చెందినవారనే వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచి అప్‌డేట్ చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సేవలో సీఐడీ లీగల్ అడ్వైజర్

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని రాష్ట్ర సీఐడీ లీగల్ అడ్వైజర్ మానేపల్లి లక్ష్మణరావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు బుద్దు సతీష్ శర్మ స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆసరా సంబరాలు

గూడూరు: వైఎస్సార్ ఆసరా 4వ విడత నిధుల విడుదలను పురస్కరించుకుని ఈనెల 25 నుంచి గూడూరు మండలంలో ఆసరా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.సుబ్బారావు బుధవారం తెలిపారు. గురువారం కప్పలదొడ్డి, 28న గూడూరు, ఫిబ్రవరి 1న తరకటూరు, 3న మల్లవోలు గ్రామాల్లో సభలు నిర్వహించి ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమాలకు జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాములు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని వెల్లడించారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ కార్యకర్తలు

గూడూరు: గత కొద్ది రోజులుగా సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం విధుల్లో చేరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగా మధుసూదనరావును కలిసిన అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం తమ డిమాండ్లపై సానుకూలంగా స్పందించిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భం ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పనిచేయాలని ఆకాంక్షించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉపశ్రీ,, అంగన్‌వాడీ కార్యకర్తలు రెజీనారాణి, శీలం కస్తూరి, వెంకటేశ్వరమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: డిమాండ్ల సాధన కోసం 42 రోజుల పాటు సమ్మె చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బుధవారం పూర్తిస్థాయిలో విధుల్లో చేరారు. అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పటంతో పాటు పౌష్టికాహారం అందించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార పదార్థాలను, సరుకులను పంపిణీ చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గూడూరు: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దారు బి.విజయప్రసాద్ తెలిపారు. బుధవారం ముక్కొల్లు శివారు నాగవరంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్ పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు వివరించారు. వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం అవసరమైన చోట్ల ర్యాంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాగునీరు, మరుగుదొడ్ల స్థితిగతులు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వో ఎం.డి.బిషర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వైద్య శిబిరం పరిశీలన

మచిలీపట్నంటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యాన్ని పేదల దరిచేర్చారని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగరంలోని 43, 3 డివిజన్లలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారు. వైద్యశిబిరాలను పరిశీలించారు. వైద్యశిబిరాలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఎంయుడీఏ చైర్మన్ బొర్రా దుర్గాభవాని, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి పర్యవేక్షించారు.

రైతు కుటుంబానికి సాయం

మంగళాపురం(చల్లపల్లి): రైతు కుటుంబానికి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. మంగళాపురం పీఏసీఎస్‌లో సభ్యత్వం కలిగిన రైతు పూతబోయిన స్వాములు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి సొసైటీ చైర్మన్ పేరం నాగిరెడ్డి బుధవారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొక్కు నాగేశ్వరరావు, సొసైటీ ఇన్‌చార్జి సీఈఓ కుందుర్తి కమలాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పెడన: ఎన్నికల సమయం కావడంతో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో పెడన పోలీసులు జల్లెడ పడుతున్నారు. వాహనాలను నిత్యం తనిఖీలు చేస్తున్నారు. బుధవారం ఉదయం బంటుమిల్లి రోడ్డు జాతీయ రహదారిపై కార్లను పరిశీలించారు. ఎస్ఐ-2 హనుమంతరావు తన సిబ్బందితో ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం
- ఉత్కంఠగా సాగిన పోటీలు



అవనిగడ్డలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, తదితరులు



వాలీబాల్ పోటీలను మేయర్ వెంకటేశ్వరమ్మతో కలిసి ప్రారంభిస్తున్న పేర్ని కిట్టు



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వాణి, పక్కన ప్రత్యేక అధికారి ఫణిదూర్జటి, పీఈటీలు, క్రీడాకారులు



కబడ్డీలో హోరా హోరీగా తలపడుతున్న నాగాయలంక, ఘంటసాల జట్లు

అవనిగడ్డ: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడానైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ పోటీలు దోహదపడతాయని చెప్పారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పథకాలు సాధించిన వారికి మంచి నగదు ప్రోత్సాహ బహుమతులు అందిస్తామన్నారు. క్రీడల ద్వారా గుర్తింపు పొందేందుకు ఇదొక మంచి అవకాశమని ఎమ్మెల్యే సింహాద్రి తెలిపారు. ఆర్డీవో వాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వామ్యులు కావాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యం పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం నాగాయలంక, ఘంటసాల జట్ల మధ్య కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, అవనిగడ్డ, పులిగడ్డ సర్పంచ్‌లు గౌరుముచ్చు ఉమా, దాసరి విజయకుమార్, ఎంపీడీవో మరియాదేవి, తహసీల్దార్ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాషా, పార్టీ యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల జయగోపాల్‌తో పాటు పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పెడన: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టారని పెడన ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. బుధవారం మండలంలోని పల్లోటి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలలో పెడన నియోజకవర్గ స్థాయిలో క్రీడా పోటీలను నియోజకవర్గ ఆడుదాం ఆంధ్ర ప్రత్యేకాధికారి, ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎం.ఫణిదూర్జటితో కలిసి ఎంపీపీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుడూ క్రీడాపోటీలు ఎంతో క్రీడాస్ఫూర్తితో జరుగుతున్నాయన్నారు. ప్రత్యేకాధికారి ఫణిదూర్జటి మాట్లాడుతూ పురుషులు, మహిళలు జట్లు 20 చొప్పున ఐదు విభాగాలకు మొత్తం 40 టీంలు వచ్చాయన్నారు. 29వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని, పల్లోటిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయని, బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు. 29న విజేతలకు నగదు బహుమతులను అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరెడ్డయ్య, టీపీవో ఏసుబాబు, ఎంఈవో-2 హరనాథ్, ఈవో పీఆర్డీ జయరామ్, పీఈటీలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు వెలికితీసేందుకే..

మచిలీపట్నంటౌన్: క్రీడాకారులను ఉన్నతస్థానాల్లో నిలిపేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. స్థానిక నోబుల్ కళాశాల ఆవరణలో నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలను పేర్ని కిట్టు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు జిల్లాస్థాయిలో, అక్కడ కూడా రాణిస్తే రాష్ట్రస్థాయిలో ప్రతిభను కనబరిచి నగదు బహుమతులను, జ్ఞాపికలను గెలుచుకునే అవకాశం ఉందన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిస్తే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే వీలు ఉంటుందన్నారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవటమే కాకుండా క్రీడలు కూడా ఆడాలన్నారు. నోబుల్ కళాశాల ప్రిన్సిపాల్ జాన్ ఎర్నెస్ట్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని రూపొందించి యువతకు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, డీఎల్‌డీవో పద్మ, 13వ డివిజన్ కార్పొరేటర్ గాజుల శ్రీదేవి భగవాన్, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ కుమార్, బాబూరావు, అశోక్, దీక్షితులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీల్లో పురుషుల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను తాళ్లపాలెం, రైలుపేట, టెంపుల్‌కాలనీ జట్లు కైవసం చేసుకున్నాయి. మహిళల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను చింతగుంటపాలెం, తాళ్లపాలెం, కొబ్బరితోట జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలను ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు, ఆడుదాం ఆంధ్రా నిర్వాహకులు అభినందించారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



చోరంపూడిలో స్థానికుల సమస్యలను వింటున్న హారిక రాములు

బంటుమిల్లి: మహిళలు ఆర్థికంగా నిలిస్తే కుటుంబం ఆర్థికంగా బలపడుతుందని ఆలోచించే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాల సొమ్ములు వారి ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారని కృష్ణా జిల్లా చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. చోరంపూడి ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం డ్వాక్రా సంఘాలకు నాలుగో విడత మంజూరైన ఆసరా చెక్కును పెడన నియోజకవర్గ సమన్వయకర్త రమేష్(రాము)తో కలసి అందజేశారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు తిరుమాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము మాట్లాడుతూ నెల రోజుల్లో మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించి మీ వద్దకు వచ్చి ఓటు అడుగుతానని అన్నారు. ములపర్రు, చోరంపూడి, మల్లంపూడి, నాగన్నచెరువు గ్రామాలకు చెందిన 192 సంఘాల సభ్యులకు రూ.కోటి 53 లక్షల చెక్కును చైర్‌పర్సన్ హారిక, రాములు స్థానిక నాయకులు, అధికారులతో కలసి అందజేశారు. ఎంపీపీ వి.చినబాబు, జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, వైస్ ఎంపీపీ ఓ.చిన్నారిబాబు, ఎంపీటీసీ టి.లక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ పి.బాబూరావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.మహేష్, వైఎస్సార్ కాంతిపథకం ఏసీ కనకరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

కృత్తివెన్ను: కృత్తివెన్ను శివాలయంలో రాము, కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అర్చకులు మురళీకృష్ణశర్మ పూజాకార్యక్రమాలు జరిపారు. పెడన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటిసారి రాము దంపతులు ఆలయానికి రావడంతో పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరై వారికి ఘన స్వాగతం పలికారు. దేవస్థాన చైర్మన్ పి.నాగేశ్వరరావు, ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి ఘనస్వాగతం



ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మికి మెమెంటో అందజేస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ, నాగేశ్వరరావు, కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే పేర్ని నాని, కిట్టు, జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నంలో రాష్ట్ర పురపాలన, పట్టణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై. శ్రీలక్ష్మికి బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఘనస్వాగతం లభించింది. తొలుత కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని), జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఆర్డీవో ఎం. వాణి మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మచిలీపట్నం నగరపాలక సంస్థ మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, భర్త చిటికిన నాగేశ్వరరావు వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని శ్రీలక్ష్మికి అందజేశారు. అనంతరం నగరంలోని పలు అంశాలపై చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి పేర్ని నాని శ్రీలక్ష్మితో చర్చించారు. స్వాగతం పలికిన వారిలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ షేక్ సలార్‌దాదా, డెప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, మాజీ మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, మాజీ డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, బందెల కవిత, మండల పార్టీ అధ్యక్షుడు లంకే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• హుండీ కానుకల లెక్కింపు

అవనిగడ్డ: మండల పరిధిలోని పులిగడ్డ వెంకటేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. రెండు సంవత్సరాలకు గాను ఈ హుండీ కానుకల లెక్కింపు చేపట్టగా, మొత్తం రూ.1,03,571 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

• శతాధిక వృద్ధురాలి మృతి



హాజరా బీ

గూడూరు: గూడూరు మండలం మల్లవోలుకు చెందిన శతాధిక వృద్ధురాలు హాజరా బీ (116) బుధవారం మృతి చెందారు. చేనేత కార్మికురాలైన హాజరాకు ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. భర్త ఇబ్రహీం ఖాన్ 1984లోనే మరణించారు. ఆమె కుమారులు, కుమార్తెలకు 130 మంది సంతానం. ప్రస్తుతం ఆమె మనవళ్లకు కూడా మనవళ్లు ఉండటం విశేషం. మల్లవోలులోని స్వగృహంలో మృతి చెందిన హాజరా బీ భౌతిక కాయాన్ని సందర్శించిన గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక ముస్లిం శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

• పేకాటరాయుళ్ల అరెస్ట్

కోనేరుసెంటర్: ఇనకుదురుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న పేకాటపై మంగళవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. స్టేషన్ పరిధిలోని చింతగుంటపాలెంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న సీఐ విద్యాసాగర్ సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు పేకాట రాయుళ్లను పట్టుకుని రూ.4100 స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు.

• పౌష్టికాహారం పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని 29వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద బుధవారం బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఆ డివిజన్ కార్పొరేటర్ కట్టా కేదారేశ్వరరావు గర్భిణులకు పౌష్టికాహార పదార్థాలైన గుడ్లు, చిక్కీ, రాగిపిండి, అటుకులు, బెల్లం, ఖర్జూరం, పాలను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

• ఓటరు దినోత్సవ పోటీల్లో విజేతలు

పెడన: ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల, కళాశాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీల్లో పెడన నియోజకవర్గ స్థాయిలో విజేతలుగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైన వారి పేర్లను ఎంఈవో-2 వై.హరినాథ్ బుధవారం వెల్లడించారు. వ్యాసరచన పోటీల్లో విశ్వభారతి ఉన్నత పాఠశాల నుంచి వీఎస్ లలిత ప్రథమం, కేఎస్ఎల్ సుమ ద్వితీయం, పెడన బీజీకే జెడ్పీహెచ్ఎస్ నుంచి పి.దిందుశ్రీవల్లి, కళాంజలి ఉన్నత పాఠశాల నుంచి జె.ముస్కాన్‌లు తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. డ్రాయింగ్‌లో బీజీకే జెడ్పీహెచ్ఎస్‌లో బి.శరణ్య, కళాంజలి నుంచి ఆర్ నాగబాబు, అబ్దుల్ వాసీంలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందారన్నారు. వక్తృత్వ పోటీల్లో విశ్వభారతి స్కూలుకు చెందిన కేఎస్ఎన్ సుమ, జెడ్పీహెచ్ఎస్ పెందుర్రు నుంచి ఎల్ ఉషశ్రీ, విశ్వభారతీ హెచ్ఎస్ నుంచి వీఎస్ లలితలు వరుసగా మూడు స్థానాల్లో నిలిచారని తెలిపారు. పాటల పోటీల్లో ఏపీఎస్‌డబ్ల్యూఆర్ ఇందుప్రియ గ్రూపు, బల్లిపర్రు ఎంపీయూపీఎస్ సంకీర్తన గ్రూపు, భానుశ్రీ గ్రూపులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారని ఎంఈవో పేర్కొన్నారు.

• రూ.23 లక్షలతో రోడ్ల అభివృద్ధి

చల్లపల్లి: గ్రామ పంచాయతీ సాధారణ నిధులతో రహదారుల అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి తెలిపారు. బుధవారం స్థానిక చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీలో గ్రామ పంచాయతీ సాధారణ నిధులు రూ.23 లక్షలతో ఏడు అంతర్గత రహదారులను జీఎస్‌బీ రోడ్లుగా అభివృద్ధి చేసే పనులను పూజలు చేసి ప్రారంభించారు. పంచాయతీ ఈఓపేర్నిమాధవేంద్రరావు, వార్డు సభ్యులు బళ్లా కుసుమ కుమారి, మరీదు భవానీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

• ఇష్టంతో చదువుకుని వృద్ధిలోకి రండి

పెడన: విద్యార్థినులు లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకుని వృద్ధిలోకి రావాలని మచిలీపట్నం ఆర్డీవో ఎం.వాణి అన్నారు. బుధవారం మండలంలోని బల్లిపర్రు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. తొలుత విద్యార్థినులు తాము నేర్చుకున్న పలు విన్యాసాలను, నృత్యాలను వేసి ఆర్డీవో వాణి, ఐసీడీఎస్ జిల్లా అధికారిణి సువర్ణ, బంటుమిల్లి పీవో సముద్రవేణిలు తిలకించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ బాలికలకు ఏమైనా ఇబ్బందులుంటే వాటిని తల్లిదండ్రులతో పంచుకోవాలని సూచించారు. చదువు పట్ల ఆసక్తి పెంచుకోవాలని, క్రీడలు కూడా మానసిక ఉత్తేజాన్ని ఇస్తాయన్నారు. ప్రిన్సిపాల్ రూతమ్మ, ఆర్ఐ మణికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కోనేరుసెంటర్: తల్లితండ్రులు ఆడపిల్లలను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాలని చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు లాస్య హరిత, పావని తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం చిన్నాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పీ హెచ్‌సీ సిబ్బంది విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్లలు విద్యావంతులుగా ఎదిగితే ఆ కుటుంబానికి గౌరవం లభించడంతో పాటు ఇతర కుటుంబాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ పరమేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

• పర్యావరణాన్ని కాపాడుకుందాం

కృత్తివెన్ను: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా గ్రీన్‌కోర్ కో ఆర్డినేటర్, సీనియర్ ఉపాధ్యాయులు సురేష్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని తీరగ్రామాలైన ఇంతేరు, పార్వతీపురం, చినపాండ్రాక గ్రామాల్లో చిత్తడి నేలల పరిరక్షణపై విద్యార్థులతో కలసి అవగాహనార్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరం పొడవునా తడి, పొడి కలయికతో ఉండే ఈ నేలల్లో మడ అడవులు పుష్కలంగా పెరుగుతాయన్నారు. వీటి వల్ల ప్రకృతి వైపరీత్యాల సమయంలో సముద్రం నుంచి తీరప్రాంతాలకు కలిగే ముప్పు నివారణకు దోహదపడతాయన్నారు. మత్స్యసంపద వృద్ధి చెందుతుందన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నేషనల్ గ్రీన్‌కోర్ సంస్థ అవగాహనా ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంతేరు, చినపాండ్రాక పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• 16 మద్యం బాటిళ్లు స్వాధీనం

నాగాయలంక: మండలంలోని గణపేశ్వరం శివారు దిండి గ్రామానికి అక్రమంగా మద్యం తరలిస్తున్న భోగాది ప్రభుప్రసాద్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్.ఐ ఎం.సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. గ్రామం సెంటర్‌లో మధ్యవర్తుల సమక్షంలో తనిఖీ చేస్తుండగా సదరు వ్యక్తి ఎలాంటి లైసెన్స్ లేకుండా అక్రమంగా 6 క్వార్టర్ల మద్యం బాటిళ్లతో సహా పట్టుబడ్డాడని ఆయన చెప్పారు.

బర్రంకుల: గణపేశ్వరం శివారు బర్రంకుల గ్రామంలో బుధవారం కమతం నరేష్‌బాబు లైసెన్స్ లేకుండా అక్రమంగా 10 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా మధ్యవర్తుల సహకారంతో పట్టుకున్నామని ఎస్.ఐ సుబ్రహ్మణ్యం చెప్పారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చామని ఎస్ఐ తెలిపారు.

బంటుమిల్లి మండలంలో.. 20

బంటుమిల్లి: గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఏ. పైడిబాబు హెచ్చరించారు. ముందస్తు సమాచారం మేరకు మండల పరిధిలోని కంచడం గ్రామంలో బుధవారం బెల్ట్ షాపుపై సిబ్బందితో కలసి ఎస్ఐ దాడి చేసి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని బి.సుజాత అనే మహిళపై కేసు నమోదు చేశారు.

బెల్ట్ షాపు నిర్వాహకురాలి అరెస్ట్

కోనేరుసెంటర్: బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఓ మహిళను ఇనకుదురుపేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. దేశాయిపేట గడ్డి బజారుకు చెందిన యార్లగడ్డ ధనలక్ష్మి బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న సీఐ విద్యాసాగర్ సిబ్బందితో దాడి చేయించారు. పోలీసుల దాడిలో ధనలక్ష్మి మద్యం బాటిళ్లు అమ్ముతూ పట్టుబడింది. ఆమె నుంచి 10 క్వార్టర్ లిక్కర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు. ధనలక్ష్మికి కోర్టు14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ విద్యాసాగర్ వివరించారు.

పౌరుల రక్షణకే చట్టాలు

సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య



మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

మచిలీపట్నంటౌన్: ప్రతి పౌరుడికి రక్షణ కల్పించేందుకే చట్టాలు రూపొందించారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, తూనికలు, కొలతలు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక పీఎం కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహనకు న్యాయవిజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు సుఖవంతమైన జీవనానికి రాజ్యాంగం పలు రకాల హక్కులను ఇచ్చిందన్నారు. క్రమశిక్షణ, శీలనిర్మాణం, జాతీయభావం అనే లక్షణాలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. తూనికలు, కొలతలశాఖ సహాయ నిర్వహణాధికారి టి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మార్కెట్‌లో జరిగే మోసాలు వివరించి నకిలీ తూకాలు, ఆహారకల్తీ వంటి వాటిని ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులు చీలి ముసలయ్య, అజ్మతున్నీసా, తూనికలు, కొలతలు శాఖ సహాయ కంట్రోలర్ ఈశ్వరరావు, పీజీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.